నవతెలంగాణ

1

ఆదిలాబాద్

సోమవారం | మే 27, 2024 | www.navatelangana.com

ఇలేగాం గ్రామంలో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-భైంసా



మండలంలోని ఇలేగాం గ్రామంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఊరి పక్కన ఉన్న చెరువు ఎండిపోవడంతో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలకు నిప్పంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గ్రామస్తులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే వచ్చి మంటలను ఆర్పి వేశారు. ఆలస్యం అయితే చెరువు పక్కన ఉన్న ఇండ్లు, పశువుల పాకలకు మంటలు వ్యాప్తించేవని స్థానికులు తెలుపుతున్నారు. ఫైర్ సిబ్బంది, గ్రామస్తులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది.

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కడెం



మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను నిర్మల్ జిల్లా డీఎస్పీ గంగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. ఇటీవల నమోదైన కేసులు వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ ఎన్నికల్లో విధులు సక్రమంగా నిర్వహించినందుకు ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డిని, పోలీసు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ సైదారావు ఉన్నారు.

ఇంట్లో ఉన్నా..వేడి సెగ..!

ఉమ్మడి జిల్లాలో ఎండలు భగభగ మండుతున్నాయి. ఇంట్లో ఉన్నా వేడి సెగ తగులుతోంది. ఎండలో తిరిగితే కాదు..కిటికీల నుంచి వచ్చే వేడిగాలులను సైతం తట్టుకోలేని పరిస్థితి. రాష్ట్రంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 7గంటల నుంచే ఎండ ప్రభావం మొదలు కావడంతో ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలంటేనే భయపడిపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నిర్మల్ జిల్లా కుభీర్‌లో 45.7డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా బేల మండల కేంద్రంలో 44.7డిగ్రీలు నమోదు కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. గత వారం రోజులుగా ఇదే మాదిరి ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో జనాలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఈ వేడికి ఇంట్లో కూలర్లు, ఏసీలు కూడా తట్టుకోలేపోతున్నాయని జనాలు వాపోతున్నారు. అనేక మంది అనారోగ్యానికి గురవుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. ఉక్కపోతను భరించలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో భగభగ మండుతున్న ఎండలు
- రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు
- కుభీర్‌లో 45.6డిగ్రీలు..బేలలో 44.7డిగ్రీలు
- బెంబేలెత్తిపోతున్న జనం..ప్రయాణాలు వాయిదా
- వేడి తీవ్రతకు కూలర్లు, ఏసీలు తట్టుకోలేని పరిస్థితి
- ఉక్కిరిబిక్కిరవుతున్న ఉమ్మడి జిల్లావాసులు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో వాతావరణ పరిస్థితులు విభిన్నంగా ఉంటాయి. ప్రతి కాలంలో దేనికదే ప్రతాపం చూపిస్తుంటాయి. అధిక వర్షాలు..చలి తీవ్రతతో పాటు ఎండల ప్రభావమూ మిగితా ప్రాంతాల కంటే అధికంగా ఉండటం ఇక్కడి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. తాజాగా ఏప్రిల్ చివరి వారం వరకు 40డిగ్రీల వరకు నమోదైన ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతూ ఏకంగా 45డిగ్రీలకు చేరువయ్యాయి. గత వారం, పది రోజులుగా ఇదే మాదిరి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం జనాల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఎండ తాకిడికి ఇంట్లో నుంచి కాలు బయటపెట్టలేని పరిస్థితి కనిపిస్తోంది. వివిధ అత్యవసర పనుల మీద బయటకు వెళ్లిన వారు అస్వస్థతకు గురవుతున్న సందర్భాలు చోటుచేసుకుంటున్నాయి. గత్యంతరం లేని పరిస్థితిలో మరికొందరు ఎండ నుంచి రక్షణ కోసం గొడుగు, లేదంటే ముఖానికి రుమాలు చుట్టుకుంటున్నారు. చాలా మంది శుభకార్యాలు, ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. విధి నిర్వహణ నిమిత్తం కార్యాలయాలకు వెళ్తున్న ఉద్యోగులు మధ్యాహ్నం సమయంలో భోజనానికి కూడా వెళ్లని పరిస్థితి కనిపిస్తోంది. ఫీల్డ్‌లో తిరిగే చిరుద్యోగులు, రోడ్ల పక్కన రోజువారీగా వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగించే వారు ఈ ఎండ ప్రభావానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎవరూ బయటకు రాకపోవడంతో వ్యాపారాలు సైతం కొనసాగించలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవడమే మేలు..!

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 45డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. కుభీర్‌లో అత్యధికంగా 45.6డిగ్రీలు నమోదు కాగా ఇదే జిల్లాలోని ముజ్గి గ్రామంలో 45.2డిగ్రీలు, తానూరులో 44.8డిగ్రీలు, కడెంలో 44.7డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలో 44.7డిగ్రీలు, ఇదే మండలంలోని చప్రాలలో 44.7డిగ్రీలు నమోదు కావడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఎండల తీవ్రత ఒకే మాదిరి ప్రభావం చూపిస్తోంది. మరోపక్క సింగరేణి ప్రాంతమైన మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణాపూర్ తదితర ప్రాంతాల్లో వేడి ప్రభావం మరింత అధికంగా ఉంటుందని చెబుతున్నారు. వివిధ ప్రాంతాల్లో వడదెబ్బకు గురై అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. వైద్యుల సూచన మేరకు కొందరు ఇంట్లోనే వైద్యం చేయించుకుంటుండగా.. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఈ ఎండల తీవ్రతకు తోడు కరెంటు కోతలు జనాలను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రోజులో పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో ఆ సమయాల్లో చిన్నారులు, ప్రజలు ఉక్కపోతను భరించలేకపోతున్నారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగం సైతం అమాంతంగా పెరిగిపోవడమూ ఓ కారణమని తెలుస్తోంది. మరోపక్క ఈ ఎండల తీవ్రతను నుంచి తమను తాము రక్షించుకోవాలంటే అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడమే మేలని వైద్యులు చెబుతున్నారు.

మనస్తాపంతో యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి



మనస్థాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భీంపూర్ మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన తోనుపు నిఖిల్(24) గతంలో ఒక ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. నాలుగు నెలల క్రితం ఉద్యోగం పోవడం మళ్లీ ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి గురై శనివారం రాత్రి వడ్డాడి మత్తడి వాగు ప్రాజెక్ట్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రాజెక్ట్ దగ్గర మోటర్ సైకిల్, చెప్పులు, సెల్ ఫోన్ కనబడటంతో స్థానికులు బైక్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం తాంసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివరాం తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు అందరిని కంటతడి పెట్టింది.

రిమాండ్‌లో ఉన్నవారిని విచారించండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడిన కేసులో అరెస్టు చేసిన సామ అశోక్ రెడ్డి, రాజేందర్‌లపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయడమే కాకుండా అసలు సూత్రధారులను గుర్తించే విధంగా రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కస్టడీలోకి తీసుకొని విచారణ జరపాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కస్టడీలో ఉన్న వారిని జిల్లా పోలీసు యంత్రాంగం తమదైన శైలిలో విచారణ జరిపి వీరి వెనుక ఉన్నటువంటి ముఖ్య నిందితులను గుర్తించి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని కోరారు.

మోటారు బిగించి నీళ్ల కష్టాలు తీర్చండి



నవతెలంగాణ-ఉట్నూర్

వేసవిలో నీటి సమస్య ఎక్కువగా ఉందని మోటారు బిగించి నీళ్ల కష్టాలు తీర్చాలని మండలంలోని ఉదానాయక్ తండా వాసులు కోరుతున్నారు. ఆదివారం ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ స్కీంలో భాగంగా తండాలో మార్చి 25న బోరు వేశారని, అందులో ఇప్పటి దాకా మోటారు బిగించలేదని ఆరోపించారు. కొన్ని రోజుల క్రితం నవతెలంగాణలో ప్రచురించిన కథనంతో అధికారులు స్పందించి ట్రాక్టర్ల ద్వారా నీళ్లు అందించారని తెలిపారు. ఇప్పుడు ఒక్క కిలో మీటర్ దూరం నుండి నీళ్లు తీసుకొని వస్తున్నామని గ్రామస్తులు అంటున్నారు. బోరు వేసి మూడు నెలలు అవుతోంది, కానీ ఇప్పటి వరకూ మోటార్ బిగించలేదని, తాగు నీటి కోసం కష్టాలు పడుతున్నామన్నారు. అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు మోటార్ బిగించి నీటి సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన దాసరి రవి కొద్ది నెలల నుండి కాలేయం సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం మండల మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న సంఘం నాయకులు విరాళాలను సేకరించి బాధిత కుటుంబానికి రూ.45 వేలు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం అందించి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుకుంటి క్రాంతి కుమార్, కోశాధికారి మగ్గిడి ప్రకాష్, సుంకిడి గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్, లింగన్న, సుంకరి రమేష్, లింగి గ్రామ కమిటీ కార్యవర్గ సభ్యులు మల్లయ్య, అన్వేష్, అంబేద్కర్ సంఘాల జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న, ఆర్ష దేవదాస్, శశికాంత్, సత్య నారాయణ, నిమ్మల ప్రశాంత్, బత్తుల విశ్వంబర్, సాయిబాబా, బెర శ్రీనివాస్, మహేందర్, జాదవ్ అజయ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల ఉన్నత పాఠశాల 2001-02 సంవత్సరనికి చెందిన పదవ తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరుంచుకుంటు సరదాగా గడిపారు. అనంతరం తమకు విద్యా బుద్ధులను నేర్పిన గురువులను సన్మానించి వారి ఆశీర్వాచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో కిషన్ రావు, నసీర్ అహ్మద్, మోహన్ రావు, అరవింద్, నరేందర్, మంజుల, ఆకుల లక్ష్మణ్, మచెందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యతకు నిదర్శనం చిన్న గ్రామాలే



నవతెలంగాణ-తాంసి

ఐక్యతకు నిదర్శనం పల్లెలు, చిన్న గ్రామాలేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని వామన్ నగర్ గ్రామాన్ని సందర్శించి అంబడి నారాయణ బాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటి సారి గ్రామానికి వచ్చిన అనిల్ జాదవ్‌ను గిరిజనులు వారి సంప్రదాయ డోలు స్వాగతించగా మహిళలు మంగళ హారతులతో తిలకం దిద్దారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురిని శాలువాతో సన్మానించారు. గ్రామ సమస్యలను వివరిస్తూ బస్సు సౌకర్యం లేకపోవడంతో చదువులకు విద్యార్థులు దూరమవుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డబుల్ బెడ్ ఇండ్లు మంజూరు చేయాలని, వృద్ధ ఆశ్రమ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణ బాబాతో గతంలో నేను ఎన్నోసార్లు కలిసినప్పుడు ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడిచి ఒకరినొకరు సాయం చేసుకోవాలని సూచించేవారన్నారు. ఆయన ఈ గ్రామంలో ఉండి ప్రతి ఒక్కరినీ భక్తి మార్గంలోకి తీసుక వచ్చి చెడు వ్యసనాలకు దూరం ఉండేటట్లు చేశారన్నారు. ఇలాంటి పల్లెలు గ్రామాలు ఎంతో ఐక్యమత్యంగ ఉంటాయన్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతానని, అప్పటి వరకు ఆసక్తి కలిగిన ఇద్దరికీ ఆటో రుణం మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులతో పాటు డబుల్ బెడ్ ఇండ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తాంసి మండల నాయకులకు వామన్ నగర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఇతర మండలాల నుంచి వచ్చిన నాయకులకు మాత్రమే స్టేజీపై కూర్చోబెట్టి వారిని మాత్రమే సన్మానించి మమ్ములను అవమానించారని తాంసి మండల ముఖ్య నాయకులు అలకా చెందారు. కార్యక్రమంలో నాయకులు వినోద్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, క్రిష్ణ, అశోక్, మహేందర్, రజినీ భూమన్న, కాంత్ రెడ్డి, అశోక్, ఉత్తం, కేదారేశ్వర రెడ్డి, కిరణ్, నాగరెడ్డి, భూమా రెడ్డి, పోచ్చన్న పాల్గొన్నారు.

శాంతి సామరస్యంగా మెలుగుదాం



నవతెలంగాణ-నార్నూర్

వివిధ వర్గాల మధ్య ఎలాంటి తగాదాలు లేకుండా అందరం శాంతి సామరస్యంగా మెలుగుదామని సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ వర్గాల ప్రజాప్రతినిధుల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకూ కూడా కొన్ని అనుకోని సంఘటనలు తప్ప అవాంఛిత సంఘటనలు మండలంలో జరగలేదని అన్నారు. ఇకపై కూడా అన్ని మతాలూ, కులాలు, వర్గ విభేదాలకు తావు లేకుండా అందరం కలిసి మెలిసి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ కులమత ఘర్షణలతో మనిషి మనిషికీ మధ్య దూరం పెరుగుతుందని, యువకులు తమ ఆవేశాలను అదుపులో ఉంచుకొని భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో సీఐ రహీం పాషా, ఎస్సై మహేష్ పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ అడే, న్యానోబా పుష్కర్, సయ్యద్ ఖాసీం, దస్తగిర్ ఉన్నారు.

రోడ్లపై షెడ్లను తొలగించిన మున్సిపల్ అధికారులు

నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్



పట్టణంలోని ప్రధాన రహదారిపై ప్రజలకు ఇబ్బంది కలిగేలా షెడ్లను వేసి కొనసాగిస్తున్న వ్యాపార సముదాయాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. పట్టణంలో జరిగే ఆది, బుధవారపు వారసంత రోజు సదరు వ్యాపారులు పోలీసు స్టేషన్ వరకు ఉన్న రహదారిపై షెడ్లను వేసి వ్యాపారం సాగిస్తుండడంతో ప్రజలకు సమస్యలు ఎదురయ్యేవి. అటవీ శాఖ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి, తహసీల్దార్ కార్యాలయం, ఎస్బీఐ, పోలీస్ స్టేషన్, రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలంటే ఈ రహదారి నుంచే వెళ్లాలి. బస్టాండ్ ప్రాంతం నుంచి పోలీసు స్టేషన్ వరకు చిరువ్యాపారులు రోడ్లపై షెడ్లు వేసి విక్రయాలు జరపడంతో అటు వైపు వివిధ పనులకోసం వెళ్లే ప్రజలు, అధికారులు, అనారోగ్య బాధితులు, 108 వాహనాలు, పోలీసు వాహనాలు, పాదచారులకు తీవ్ర ఇబ్బంది కలిగేది. ఇటీవల పట్టణ ప్రజలు మున్సిపల్ కమిషనర్, చైర్మెన్‌కు పరిస్థితిని వివరించారు. వారసంత, రోజువారి కూరగాయల క్రయవిక్రయాలు రోడ్డుపై కాకుండా పాత అంగడి బజార్‌లో జరపాలని చైర్మెన్ చిన్నం సత్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, వైస్ చైర్మెన్ కావలి సంతు, కమిషన్ మనోహర్, నాయకులు పరిమి సురేష్, నాయిని సంతోష్, హమానుల్లా ఖాన్, సిబ్బంది కలిసి పోలీసుల సహకారంతో రోడ్లపై వేసిన షెడ్లను తీసివేసి పాత అంగడి బజార్ స్థలంలో వ్యాపారం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. సదరు వ్యాపారులకు సరిపడా స్థలం కెటాయించి మార్కింగ్ చేశారు. వందల ఏండ్లనుంచి కొనసాగుతున్న వారసంతను కరోన సమయంలో అప్పటి పరిస్థితుల నేపథ్యంలో వ్యక్తుల మధ్య దూరం పాటించేలా అంగడి బజార్ నుంచి బస్టాండ్ వరకు రహదారిపై నిర్వహించారు. అప్పటి నుంచి చిరువ్యాపారులు అలాగే కొసాగిస్తుండడం పట్టణ ప్రజలకు సమస్యగా మారడంతో మున్సిపల్ అధికారులు ఇప్పుడు ఈ చర్యలు తీసుకున్నారు.

చైర్మెన్ తీరు అభినందనీయం

వారసంత నిర్వాహణ విషయంలో స్థానికుల అవస్తలను గుర్తించి సరైన నిర్ణయం తీసుకున్న మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, కమిషన్ మనోహర్ తీరును పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. గతంలో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన నాయకులు పట్టించుకోలేని సమస్యను మున్సిపల్ వచైర్మెన్, పాలక సభ్యులు పరిష్కరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోతి దాడిలో ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ-భైంసా



పట్టణంలోని పురాణ బజార్‌లో కోతి దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఓ వానరం బీభత్సం సృష్టించి ముగ్గురిని గాయపర్చడంతో అక్కడి వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పురాణ బజార్‌కు చెందిన జ్యోతి అనే మహిళతో పాటు, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కోతుల బెడద నుంచి తమను కాపాడాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, కోతుల వల్ల బయటకు వెళ్లాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయా ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు అమ్మకూడదని సూచించారు. రైతులు కొన్న విత్తనాలకు ప్రతి ఒక్కరికీ రశీదు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాము, ఆయా దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-తలమడుగు

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా మండలంలోని పూనగూడ, పల్సి(బి) తాండ గ్రామాలలో ధ్వంసమైన ఇండ్లను ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి భరోసా కల్పిస్తూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి ప్రభుత్వం తరపున వారికి సాయం అందించేల కృషి చేస్తామన్నారు. అనంతరం పాక్షికంగా ఇండ్లు దెబ్బతిన్న కుటుంబాలకు టార్పలిన్లను అందజేశారు. అనంతరం పల్సి(బి) తాండ సందర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, ఎంపీటీసీ చంటి, ఆ పార్టీ నాయకులు కేదరేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గంగాధర్, అబ్దుల్లా, రాంబాయి, రామ్ కిషన్, పల్లవి, అభిరామ్‌రెడ్డి, నవీన్ రెడ్డి, మాడూరి మల్లేష్, మాడూరి రమాకాంత్, మేర రమేష్, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

ఖైతరాబాద్ డీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

నవతెలంగాణ-బోథ్

అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహన్ రెడ్డిని బోథ్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం కలిశారు. ఖైరతాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గత పార్లమెంట్ ఎన్నికలు, బోథ్ నియోజకవర్గానికి చెందిన పోల్ మేనేజ్మెంట్ గురించి అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయాలపై నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కూరుమే మహేందర్, కాంగ్రెస్ నాయకులు మెరుగు భోజన్న, బారె నాగేందర్, గంగ మల్లు, రాజశేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

రేడియాలజిస్ట్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రిమ్స్ ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన డాక్టర్ కోలుకోవడంతో పాటు ఆదివారం కళ్యాణ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, సాయి చరణ్ గౌడ్, చంద్రశేఖర్, గోవర్ధన్ రెడ్డి, నవీన్ రెడ్డి, రూపేష్ రెడ్డి ఉన్నారు.

ఘనంగా నేషనల్ 108 పైలెట్స్ డే

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



నేషనల్ 108 పైలెట్స్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రామ్ మేనేజర్ సామ్రాట్, జిల్లా అధికారి తిరుపతి సిబ్బంది కేక్‌కట్ చేసి తినిపించుకుంటు శుభాకాక్షంలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సమయంలో పైలెట్ సేవలు అత్యుత్తమని కొనియాడారు. కార్యక్రమంలో 108 పైలెట్ వసీం, ముజఫర్, విఠల్ గౌడ్, రెహమాన్, వినోద్, సత్యనారాయణ, అజీమ్ పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా... ఆంధ్రా నర్సరీలు..

- నాసిరకం నారుతో రైతన్నకు మోసం
- రైతుకు బిల్లులు చెల్లించని వైనం
- మామూలుగా తీసుకుంటున్న ఉద్యానవన శాఖ
- లైసెన్స్ లేని బినామీ నర్సరీలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆంధ్రా నుంచి వలస వచ్చిన నర్సరీ నిర్వాహకులు పుట్టగొడుగుల్లా నర్సరీలను పెట్టుకొని ఏజన్సీలో దర్జాగా వ్యాపారం చేస్తున్న వీరిని పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. పైగా వీరికి ఎలాంటి లైసెన్సు ఉండదు. ఇలా ప్రతి ఏటా నాసిరకం నారును అమ్ముతూ లక్షల్లో వెనుకేసుకుంటున్నారు. రైతులు కొన్న వివిధ రకాల నారుకు ఎలాంటి బిల్లు (రశీదు) ఇవ్వకుండా వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఈ నర్సరీ నిర్వాహకులపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

మండలంలో వాణిజ్య పంటలైన పత్తి-20,926 ఎకరాలు, సోయా-8459, కందులు-3814, మొక్కజొన్న-196 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీంతో పాటు గుడిహత్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో కలిపి 186 ఎకరాల్లో టమాటా పంట, పచ్చి మిర్చి 20 ఎకరాలు, వంకాయ-10 ఏ., కాలీఫ్లవర్-17 ఎకరాల్లో కూరగాయల పంటలను సాగుచేస్తున్నట్లు ఆ శాఖ లెక్కలు తెలుపుతున్నాయి.

రైతులకు బిల్లులు ఇవ్వడం లేదు

జాదవ్ హీరాలాల్, రైతు గ్రామం ధనోరా(బి)



నర్సరీలో నాసిరకం విత్తనాలను నాటి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. పైగా కొన్న నారుకు రశీదు ఇవ్వాలని అడిగితే ఇష్టముంటే కొనండి లేదంటే వెళ్లండి అంటూ పొంతన లేని సమాధానం ఇస్తున్నారు. బిల్లులు మాత్రం ఇవ్వడం లేదు.

విత్తనం ఒకటి అమ్మేది మరొకటి..

వివిధ రకాల కూరగాయల నారుకు డిమాండ్ పెరుగడంతో గత నాలుగైదు ఏండ్ల క్రితం కేవలం గుడిహత్నూర్ కేంద్రంగా రెండు నర్సరీలు ఏర్పడ్డాయి. ఈ నర్సరీలో టమాటా, వంకాయ, క్యాబేజి, మిర్చి, కాలీఫ్లవర్ వంటి నారుకు డిమాండ్ అధికంగా ఉంది. టమాటాలో యూఎస్-448 రకం, సాహు, సాహిత్య వంటి వంగడాలకు నాణ్యమైనవి కావడంతో వీటికి రైతుల నుంచి భారీగా డిమాండ్ ఉంటుంది. ఇదే అదనుగా భావించిన నర్సరీ నిర్వాహకులు తక్కువ రకం వంగడాలను నారు మడుల్లో పెంచి ఒక్కో నారుకు 1.50 పైసల నుంచి 2 రూపాయల వరకు అధిక ధరకు అమ్మి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు.ఒక్కో ప్యాకెట్ లో టమాటా విత్తనాలు 3 వేల వరకు ఉంటాయి.ఆ పాకెట్ ధర నాణ్యతవి తీసుకుంటే రూ.900 వరకు విత్తన డీలర్ల వద్ద దొరుకుతోంది. ఇలా తెచ్చి నర్సరీలో పెంచిన నారును నర్సరీలో పెంచి ఒక్కో నారును రెండు



రూపాయల వరకు అమ్ముతారు. ఒక్క పాకెట్‌లో మూడు వేల విత్తనాలకు రూపాయలు రెండు చొప్పున అమ్మిన 6 వేల వరకు ఆదాయం వస్తోంది. దీనిని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు. ఒక లక్ష ఖర్చు చేసి లక్ష నారు అమ్మితే ఆరింతలు అనగా ఆరు లక్షల ఆదాయం వస్తోంది. అందుకే ఈ నర్సరీ నిర్వాహకులు ఆంధ్ర, రాయల సీమ మదినేపల్లి, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి ఇక్కడ వలస వచ్చి పదుల సంఖ్యలో నర్సరీలను ఏర్పాటు చేస్తూ ఏజెన్సీలోని అమాయక గిరిజన, గిరిజనేతర రైతులను కుచ్చుటోపీ చేస్తున్నట్లు ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

పుట్టగొడుగుల్లా నర్సరీలు..

గుడిహత్నూర్ మండలం సీతాగొంది, గుడిహత్నూర్, తోషం, టాకీగూడ, ముత్నూర్, ఏమాయికుంట, ఇంద్రవెల్లి, శ్యాంపూర్, మన్నూర్ తదితర గ్రామాల్లో ఈ నర్సరీలు పదుల సంఖ్యలో వెలిశాయి. ఇప్పటికైనా ఈ నర్సరీ నిర్వాహకులపై ఉద్యానవన శాఖ దృష్టి సారించాలని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

ఉద్యానవన శాఖ గుర్తించిన విత్తనాలు నర్సరీలో విత్తాలి

నర్సరీ నిర్వాహకులకు ఉద్యానవన శాఖ సిఫారసు చేసిన విత్తనాలను తీసుకోవాలని అధికారులు అంటున్నారు. నారుకొన్న రైతుకు దొంగ చాటుగా నకిలీ నారు అమ్మకుండా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ప్రతి కూరగాయల నారు కొన్న రైతుకు రశీదు తీసుకోవాలని సూచిస్తున్నారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్



నవతెలంగాణ-కడెం

నెంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేస్తామని ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ వాహన తనిఖీల్లో నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడుపుతున్నట్టు గమనించి, ఇటీవల చాలా మంది నెంబర్ ప్లేట్ లేని వాహనాలను, క్రిమినల్‌గా ఉపయోగించుటకు గానీ, చల్లాన్ పడకుంటా గానీ, తప్పించుకొనుటకు నెంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్నట్టు గమనించారు. వాహనాలు తనిఖీ చేసి సుమారు 10 మోటార్ సైకిళ్ల నెంబర్ ప్లేట్ లేకుండా ఉన్న వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్సై కష్ణ సాగర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ తారుమారు చేసినా, స్టిక్కర్లు కనిపించకున్నా బండిని సీజ్ చేస్తామని పేర్కొన్నారు. మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి బైకులు కానీ ట్రాక్టర్‌లు కానీ మరే ఇతర వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ముఖ్యంగా ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు తమ వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్ వాహనదారుని పేరు మీద తమ వాహనం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కడెం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన బీడీ కార్మికుల వేతనాలు అమలు చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీడీ కార్మికులకు, ప్యాకర్స్‌కు పెరిగిన నెలవారీ వేతనాన్ని అమలు చేయాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి గంగన్న డిమాండ్ చేశారు. అనంతరం బీడీ యజమానులు కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరుపుతూ బీడీ కార్మికులందరికీ నెలసరి ఉద్యోగులకు బీడీ ప్యాకర్స్‌కు నూతన వేతన ఒప్పందం కొరకు ఆదివారం హైదరాబాద్‌లో మినర్వా గార్డెన్ హోటల్లో జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. ఈ చర్చల్లో బీడీ కార్మికులకు 1000 బీడీలకు రూ.425, అలాగే బీడీ ప్యాకర్స్‌కు రూ.3,650, నెలసరి ఉద్యోగులకు రూ.1700 వేతనాలు అమలు చేయాలని నిర్ణయించారు. ఈ చర్చల్లో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్, కె.రాజన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు, యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎం. వెంకట్, ముత్తన్న, సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి జిందం ప్రసాద్ పాల్గొన్నారు.

విరిగిన చెట్టు నిలిచిన రాకపోకలు



నవతెలంగాణ-తాంసి

మండలంలోని హస్నాపూర్ గ్రామ సమీపంలోని అంతర్‌రాష్ట్ర రహదారిపై ఆదివారం సాయంత్రం ఈదురుగాలులకు బారీ వృక్షం నెలకొరిగింది. దీంతో రాకపోకలు నిలిచి పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ రహదారి గుండా మహారాష్ట్ర, తాంసి, తలమడుగు మండలాల ప్రజలు నిత్యం జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. రోడ్డుపై చెట్టు విరిగి పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న తాంసి ఎస్సై సంఘటన స్థలానికి చెరుకొని, పక్కనుంచి తాత్కాలికంగా దారి ఏర్పాటు చేసి వాహనాలను పంపించారు.

ఘనంగా బీమన్న దేవుని పండుగ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజూర గ్రామంలో ఆదివారం ఆదివాసుల ఆరాధ్య దైవం భీమన్న దేవుని పండుగ ఆదివాసీ నాయక్ పోడ్ సేవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండాలని ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని భీమన్న దేవుడికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నముల్ల భోజన్న, సంఘ నాయకులు నముల్ల రాములు, నముల్ల చిన్న సాయన్న సతీష్, సూర్యం, రాజు, నర్సయ్య రవి, అరుణ్, మహిళలు, చిన్నారులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1995-96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి గురువులను ఆహ్వానించి, శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులతో ఆనందంగా గడిపారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని చిన్ననాటి తీపి గుర్తులను గుర్తు చేసుకుని, రోజంతా సంతోషంగా గడిపారు.

ఆటోలో వచ్చి దాడిచేసి నగదు దోచుకెళ్లారు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నలుగురు ఆగంతకులు ఆటోలో వచ్చి ఓ వ్యక్తిపై దాడి చేసి నగదు దోచుకెళ్లిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. బేల మండలం అవాల్‌పూర్ గ్రామానికి చెందిన మెస్రం కైలాస్ శనివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఒక హోటల్‌కు వెళ్లాడు. అతని వద్ద డబ్బులు ఉన్న విషయాన్ని గ్రహించిన నలుగురు ఆగంతకులు ఆటోలో వచ్చి మెస్రం కైలాస్ హోటల్ నుంచి బయటకు రాగానే అతనిపై దాడి చేసి రూ.10 వేల నగదు లాక్కొని పరారయ్యారు. దీంతో బాధితుడు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దుండగులు పాత నేరస్థులుగా గుర్తించారు. వారికోసం గాలిస్తున్నట్టు సీఐ తెలిపారు.



రైతులపై పెట్టుబడుల భారం

- ఏటేటా పెరుగుతున్న సాగు ఖర్చులు
- పెరిగిన ఎరువుల ధరలు.. ఇంధన ఖర్చులు

నవతెలంగాణ-సిరికొండ

ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలకు ఏటేటా పెరుగుతున్న పెట్టుబడులు భారంగా మారుతున్నాయి. సాగు భారం రైతన్నకు గుదిబండగా మారుతుంది. ట్రాక్టర్లు, యంత్రాలు, కూలీలు, ఎరువులు, విత్తనాల ధరలు కూడా అమాంతంగా పెరగడంతో, పెట్టుబడులు రైతుల నెత్తిన తడిసి మోపడౌతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరానికి పెట్టుబడి సాయం అందజేస్తున్నా అదనంగా వస్తున్న ఖర్చులకే సరిపోతుంది. గత ఏడాది కంటే ఎకరానికి ఈ ఏడాది సాగుకు రూ.5వేల వరకు అదనపు భారం పడుతుంది. మండలంలో వర్షాధారంపై ఆధారపడి అత్యధికంగా రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 7 వేల ఎకరాలకు పైగా పత్తి పంట సాగు అవుతుంది. పత్తితో పాటు సోయా, కంది, జొన్న మొదలైన పంటలపై ఆధారపడుతున్నారు.

పెరిగిన ఎరువుల ధరలు.. ఇంధన ఖర్చులు..

రైతులకు విత్తన ధరతో పాటు, గతేడాది ఎరువుల ధరలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ తగ్గించడంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఏకంగా 360 నుంచి 700 వరకు పెరిగాయి. ఎరువుల ధరలతో పాటు ఇంధన ఖర్చులు పెరగడం, వ్యవసాయంలో యంత్రాల వినియోగంతో ఇంధన ఖర్చు పెరిగిపోయింది. గత వర్షాకాలంలో ట్రాక్టర్



కిరాయి గంటకు 600 ఉంటే ఈ ఏడాది గంటకు 800 తీసుకుంటున్నారు. గతేడాది పత్తికి ఎకరానికి పెట్టుబడి 30వేలు వస్తే ఈ ఏడాది 35 నుంచి 40వేల మధ్యన వచ్చే అవకాశం ఉంది. కూలీల కొరత ఏర్పడితే ఇతర గ్రామాల నుంచి వచ్చే కూలీలకు అదనంగా చెల్లించాల్సి వస్తుంది.

పంటలకు మద్దతు ధర ఇవ్వాలి

ప్రహ్లాద్, రైతు రిమ్మ



పెట్టుబడులు పెరుగుతున్న కారణంగా ప్రభుత్వం కూడా రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి. లేకుంటే నష్టాలను చవి చూడాల్సి ఉంటుంది. ఇంధన ధరలు పెరగడంతో ట్రాక్టర్ కిరాయి పెంచారు. దీంతో పాటు కూలీల రేట్లు పెరగడం ఎకరం వెంబడి అదనపు ఖర్చులు మీద పడుతున్నాయి.

లాభాలు రావడం లేదు

మారుతి, రైతు సిరికొండ



పంటల సాగు పెట్టుబడి పెరగడంతో రైతుల నెత్తిన అప్పుల భారం తడిసి మోపెడవుతుంది. దీంతో లాభాలు రావడం లేదు. గత వానాకాలంతో పోలిస్తే ఇప్పుడు ఎకరానికి 5వేల నుంచి 8వేల మధ్యన అదనపు బారం పడుతుంది. వ్యవసాయం చేసే కూలీల సంఖ్య తగ్గుతుంది. కానీ రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు లేక పెరిగిన పెట్టుబడులతో అప్పులు మీద పడుతున్నాయి.

నిలిచిన విద్యుత్ సరఫరా ఉక్కపోతతో జనం విలవిల

- చల్లగాలి కోసం ద్విచక్ర వాహనాలపై చక్కర్లు

నవతెలంగాణ-తలమడుగు

నిలిచిన విద్యుత్ సరఫరాతో మండలవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత నాలుగు రోజుల కింద కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి విద్యుత్ స్తంభాలు అక్కడక్కడ వంగిపోయి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో శనివారం రాత్రి 12 గంటలకు విద్యుత్ నిలిచి పోయింది. దీంతో మండల ప్రజలు ఉక్కపోతతో విలవిల చెందారు. రాత్రంతా నిద్రలు లేక ఇబ్బందులకు ఎదుర్కొన్నారు. చిన్నారులు వెడిమికి తాళలేక ఏడువడంతో తల్లిదండ్రులు పెద్ద సమస్యగా మారింది. వారిని నిద్రపుచ్చడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. చివరకు ఎమి చేయలేక వారిని ద్విచక్రవాహనం కూర్చొబెట్టుకొని చల్లగాలి కోసం చక్కర్లు కొట్టారు. విద్యుత్ లేక సెల్‌ఫోన్ చార్జీంగ్‌లు పెట్టలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా తాగు నీటి సమస్య ఏర్పడింది. అధికారులు స్పందించి విద్యుత్ అంతరాయం సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

అడెల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆదివారం ఉదయం నుండే భక్తులు కోనేరు నీటితో స్నానాలు చేసి అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్రలోని నాందేడ్, నాగపూర్, పర్భని జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాలు ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని మొక్కలను తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో అసంఘటిత కార్యక్రమాలకు తావు లేకుండా స్థానిక ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

చెలరేగిన మంటలు.. తప్పిన పెను ప్రమాదం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామ శివారులో ఆదివారం మంటలు చెలరేగాయి. గ్రామస్తుల అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. రాచపూర్, పొట్టపెల్లి గ్రామల పంట పొలాల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగి పొట్టపెల్లి గ్రామనికి దగ్గరగా వ్యాపించడంతో గ్రామస్తులు భయందోళనకు గురయ్యారు. గ్రామస్తులు అగ్ని మాపక సిబ్బంది, స్థానిక ఎస్సైకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఫైర్ సిబ్బంది 2 గంటల పాటు శ్రమించి పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు.

గ్రామస్తులు, యువత కృషి అభినందనీయం

గ్రామస్తులు, యువత ప్రాణాలకు తెగించి అగ్ని మాపక సిబ్బంది వచ్చే వరకు మంటలార్పి పరిస్థితి చేయి దాటకుండ పరిస్థితి అదుపులో ఉంచారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ యువకులను అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లు ధ్వంసం.. రాగి తీగల చోరీ..

నవతెలంగాణ-లోకేశ్వరం

విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి తీగలు చోరీ చేసి ఎత్తుకెళ్లిన సంఘటన శనివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. విద్యుత్‌శాఖ ఏఈ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంచగుడి ఎత్తిపోతల పథకానికి చెందిన విద్యుత్ సబ్ స్టేషన్‌లోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేసి వాటిలోని రాగి తీగలను చోరీ చేశారు. చోరీకి గురైన రాగి తీగలు, ఇతర వస్తువుల విలువ సుమారు రూ.10 నుంచి 15 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. దీంతో ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం ఉదయం గమనించిన ఎత్తిపోతల పథకం కమిటీ సభ్యులు లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి విద్యుత్ శాఖ ఏఈకి సమాచారం ఇచ్చారు. గతంలో కూడా ఇదే తరహాలో కనకాపూర్ ఎత్తిపోతల పథకానికి చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి తీగలను చోరీ చేశారు. కాగా రైతులు డబ్బులను జమ చేసి మరమ్మతులు చేయించుకున్నారు. కానీ నిందితులు ఇంతవరకు పట్టుబడలేదు. దుండగులు పక్కా ప్రణాళికతో గోదావరి పరివాహక ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్లను మాత్రమే ధ్వంసం చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు.



సాలెగూడా బీసీవాడ సమస్య తీరేదెన్నడు..?

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని సాలెగూడా గ్రామంలో గల గాంధీచౌక్ బీసీవాడ ప్రధాన రహదారి మోకాళ్ళ లోతు నీటితో నిత్యం ఉండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తీవ్ర వేసవి కాలం నేపథ్యంలోనే అడపదడపా కురిసిన వర్షాలతో రహదారిపై నీళ్లు నిలిచి దోమలతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు కనీసం నీటిని తొలగించే చర్యలు కూడా తీసుకోకపోవడంపై మండిపడుతున్నారు. పక్కన డ్రైనేజీ నిర్మిస్తే నీటి నిలువ సమస్య కొంత తీరుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇదే విషయం పంచాయతీ సెక్రెటరీ అడగడానికి పలుమార్లు ఫోన్ ద్వారా ప్రయత్నం చేయగా ఆమె స్పందించలేదు. వెంటనే రోడ్డుపై నీరు తొలగించి కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుత్‌షాక్ తగిలి ఎద్దు మృతి

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని లగ్గం గ్రామంలో విద్యుత్‌షాక్ తగిలి మోరే బాపుకు చెందిన ఎద్దు ఆదివారం మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం మేతకు వెళ్లిన ఎద్దు గ్రామ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. ఎద్దు విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అదే విధంగా ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచేలు వేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అయ్యో పాపం

- అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలు
- నానమ్మ తాతయ్యేలే దిక్కు

పదేండ్ల కిందట అనారోగ్యంతో అమ్మ దూరమైంది. అప్పటి నుంచి ఆలనాపాలనా చూసేందుకు తండ్రియే దిక్కయ్యాడు. కాయకష్టం చేస్తూ పిల్లలకు కడుపు నిండ భోజనం పెట్టాడు. కంటినిండ నిద్రపుచ్చాడు. ఇలా సాగుతున్న వీరి జీవనం ఒక్కసారిగా అనూహ్య మలుపు తిరిగింది. ఇన్నాండ్లు కంటికిరెప్పలగా కపాడిన తండ్రి మడావి దివాకర్ హఠాన్మరణం చెందాడు. ఈ అనూహ్య సంఘటనతో ఈ పిల్లల జీవనం అయోమయంలో పడింది. ప్రస్తుతం వృద్ధులైన తాతయ్య, నామమ్మలే దిక్కు అయ్యారు. వయోభారంతో ఈ పిల్లల ఆలనాపాలనా చూసుకోవడం కష్టతరంగా మారింది. పదేండ్ల వ్యవధిలో తల్లిదండ్రులను కొల్పోయిన ముగ్గురు పిల్లలు అనాథాలుగా మారడం అందరిని కలిచివేస్తుంది. ఉదార స్వభావులు వీరిని ఆదుకోవాలని కోరుతున్నారు.



నవతెలంగాణ-కౌటాల

తల్లిదండ్రులను కొల్పోయి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారి అప్పన్న కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సంఘటన మండలంలోని పార్డీ గ్రామంలో జరిగింది. పార్డి గ్రామానికి చెందిన గిరిజన పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయి ఇప్పుడు దయనీయ స్థితిలో ఉన్నారు. గ్రామానికి చెందిన మడావి దివాకర్ (36)కు 2010లో దహెగం మండలానికి చెందిన భారతితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కొడుకులు 12 ఏండ్ల అజిత్ కుమార్, 11 ఏండ్ల విజయ్ కుమార్ పుట్టారు. అయితే 2013లో తల్లి భారతి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో తండ్రి దివాకర్ ఇద్దరు కొడుకులను పెంచాడు. ఈ క్రమంలో పిల్లలు, కుటుంబం కోసం ఏడాది కిందట మహారాష్ట్రలోని వీరూర్‌కు చెందిన శారద(30)తో మరో వివాహం చేసుకున్నాడు. ఈ ఏడాది మార్చిలో మగ శిశువు శివ కుమార్‌కు జన్మనిచ్చింది. పుట్టిన అయిదు రోజులకే శారద అనారోగ్యంతో హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతూ మార్చి 15న మరణించింది. ఇంతలో విధి మరింత కన్నెర్ర చేసింది. అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాడావి దివాకర్ రెండు రోజుల క్రితం ఊహించని రీతిలో కన్నుమూశాడు. దీంతో ఈ ముగ్గురు పిల్లలు ఇప్పుడు నానమ్మ తాతయ్య విమలాబాయి, కాశీనాథ్ దగ్గర ఉన్నారు. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారి అమ్మ అని పిలుపుకు నోచుకోక రోజు గుర్తుకు వచ్చినప్పుడల్లా అమ్మ అంటూ నానా అంటూ బోరున విలపిస్తుంటే గ్రామస్తులు కంటతడి పెట్టుకుంటున్నారు. వయోభారంతో తమ పోషణ భారంగా ఉన్న వారికి పిల్లల పోషణ మరింత కష్టతరంగా మారుతుందని విమలబాయి, కాశీనాథ్ అంటున్నారు. దాతలు ముందుకు వచ్చి అనాథలకు ఆసరాగా నిలవాలని గ్రామాస్తులు కోరుతున్నారు.



కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కడంబా అటవీప్రాంతంలో ఆదివారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. వన్యప్రాణుల రక్షణలో అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఘటన చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ నెల 16న సిర్పూర్(టి) మండలం పెద్దబండ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మరణించిన ఘటన తెలిసిందే. పది రోజుల వ్యవధిలోనే రెండు చుక్కల దుప్పులు మృత్యువాతపడడం అటవీశాఖ అధికారులు పనితీరును తెలియజేస్తోంది. డివిజన్ పరిధిలో పెద్దపులుల ఆహారానికి వన్యప్రాణులు లేక గ్రామ పరిసరాల్లోకి వస్తుండడంతో కొన్ని నెలల క్రితం అంకుసాపూర్ అటవీ ప్రాంతంలో 200 దుప్పులను వదిలారు. దరిగాం, గోంది అటవీ ప్రాంతాల్లో దుప్పులు మృత్యువాత పడినట్టు తెలుస్తోంది. బీట్ అధికారులు కొంతమంది మంచిర్యాల, ఇతర ప్రాంతాల నుండి రాకపోకలు సాగిస్తూ మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిబ్బంది విధుల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతో వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోతోందని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి స్థానిక అటవీ అధికారులు విధుల నిర్వహణపై దృష్టి సారిస్తే వన్యప్రాణుల రక్షణకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని కృష్ణపెల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన ఇట్యాల సీతారాం, ఇట్యాల అంజి ద్విచక్ర వాహనంపై కృష్ణపెల్లి వెళుతున్న క్రమంలో కృష్ణపెల్లి గ్రామానికి చెందిన మాండూరి వెంకటేష్ అనే బాలుడు సైకిల్ తీసుకొని రావడంతో గమనించిన అంజి ద్విచక్ర వాహనం సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనకాల ఉన్న సీతారాం ఎగిరి కింద పడ్డాడు. బైక్ తనను గుద్దుతుందని ఒక భయంతో మాండూరు వెంకటేష్ సైకిల్ బ్రేక్ వేయడంతో తను కూడా కిందపడ్డాడు. ఈప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. సీతారాంకు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం కరీంనగర్ తరలించారు.

ధాన్యం లక్ష్యం చేరే దిశగా ప్రయత్నం

- జూన్ 10 వరకు కొనసాగనున్న కేంద్రాలు
- చివరి గింజ వరకు కొంటామంటున్న అధికారులు



అప్పపెల్లిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రం



ఇటీవల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆరుగాలం కష్టపడి యాసంగిలో రైతులు పండించిన పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ దిశగా రైతులకు అధికారులు భరోసా కల్పించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే జిల్లాలో అవసరమైనన్ని హార్వెస్టర్లు అందుబాటులో లేకపోవడం పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం కురుస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల క్రితమే వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ పంట రైతు చేతికి రాకపోవడంతో కొనుగోలు కేంద్రాలోకి రాలేదు. ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండడంతో లక్ష్యం చేరుకునే దిశగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

లక్ష్యం చేరే దిశగా అధికారుల ప్రయత్నాలు

జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో కొన్ని మండలాల్లో మాత్రమే యాసంగి పంట వేశారు. వీటిలో అధికారుల అంచనా ప్రకారం 45000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 37 కేంద్రాలు ప్రారంభించినప్పటికీ వరి ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రాలకు చేరుకోకపోవడంతో 26 కేంద్రాలు నడుస్తున్నాయి. వీటి ద్వారా 856 మంది రైతుల వద్ద నుండి 4629 మెట్రిక్ టన్నుల రూ.10 కోట్ల విలువ గల ధాన్యం కొనుగోలు చేసిన అధికారులు రూ.నాలుగు కోట్ల చెల్లింపులు చేశారు. మిగతావి కూడా కొనసాగుతున్నట్లు తెలిపారు. నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.

జూన్ 10 వరకు కొనసాగనున్న కేంద్రాలు

గత సంవత్సర అనుభవాల నేపథ్యంలో ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో యాసంగి పంట కాస్త ఆలస్యంగా చేతికి వస్తుందని అధికారులు అంచనలు వేశారు. దీని కారణంగా జూన్ 10 వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. అప్పటి వరకు మిగిలిన పంటలను విక్రయించుకోవాలని రైతులకు సూచిస్తున్నారు.

చివరి గింజ వరకు కొనుగోలుకు సన్నాహాలు

జిల్లాలో ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందకూడదని చివరి గింజ వరకు వరి కొనుగోలు చేయడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఇప్పటికే ప్రకటించారు. అధికారులు కూడా రైతులకు అవసరమైన చోట భరోసా కల్పించడమే కాకుండా నిబంధనలకు అనుగుణంగా ఉన్న ప్రతి గింజను కొనుగోలు చేస్తామని తెలుపుతున్నారు. కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలిస్తు కొనుగోళు చేసిన ధాన్యన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు పంపుతున్నారు.

రైతులు అధైర్య పడొద్దు

వినోద్ కుమార్, డీఎస్ఓ

ప్రస్తుతం అకాల వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో యాసంగి వరి పండించిన రైతులు అధైర్య పడవద్దు. ప్రభుత్వ నిర్ణయం మేరకు చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం. తేమ శాతం నిబంధనల మేరకు ఉండేలా రైతులు చూసుకోవాలి.

గెరిల్లా పోరాటం చేసిన యోధుడు భీం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

నవతెలంగాణ-కౌటాల



భీం విగ్రహాన్ని ఆవిష్కరించి నినాదిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణక్క

నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటం చేసిన గొప్ప యోధుడు కుమురం భీం అని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క అన్నారు. తాటిపల్లి గ్రామంలో ఆదివారం భీమ్ విగ్రహాన్ని సుగుణక్క భూజంగరావు దంపతులు ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ అడవిని జీవనోపాధిగా చేసుకొన్న కుమురం భీం నిజాంలను ఎదురించాడని తెలిపారు. పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా నిజాంపై పోరాటం చేశారని గుర్తు చేశారు. జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో ఉద్యమించి వీరమరణం పొందాడని కొనియాడారు. భీం ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీకని తెలిపారు. ఆదివాసుల క్షేమం కోసం చివరి వరకు పోరాడిన గొప్ప యోధుడని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఆదివాసీ గిరిజనులకు రాబోవు రోజుల్లో పోడు భూములకు పట్టాలిస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన సుగుణక్కకు ఆదివాసులు సాంప్రదాయం ప్రకారం చిన్నారులు నృత్యాలు చేస్తూ స్వాగతించారు. కార్యక్రమంలో కుమురం భీం మనుమడు సోనేరావు, ఆదివాసీ సీనియర్ నాయకులు కుమురం మాంతయ్య, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడాం గణపతి, గ్రామ పెద్దలు సోయం మనోహర్, గావుడే పురుషోత్తం, సోయం సంతోష్ పాల్గొన్నారు.

ఆహా..భలే మజా.. తాటి ముంజ

- వేసవి తాపానికి ఉపశమనం..
- ఆరోగ్య ప్రయోజనాలు అనేకం
- ఆసక్తి చూపుతున్న జనాలు... పెరిగిన అమ్మకాలు

నవతెలంగాణ-బెజ్జూర్

తాటి ముంజల సీజన్ వచ్చేసింది. సమ్మర్ సీజన్ వచ్చిందంటే చాలు తెల్లతెల్లటి తాటి ముంజలు ముత్యపు చిప్పల్లా మెరిసిపోతూ మనకు నోరూరిస్తాయి. చెప్పాలంటే కల్తీలేనివి, స్వచ్ఛమైన పండు ఏదైనా ఉందా అంటే.. అది తాటి ముంజలే అని చెప్పొచ్చు. తాటి ముంజలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలేన్నో ఉన్నాయి. గ్రామాల్లో మండల కేంద్రాల్లో నగరాల్లో తాటి ముంజల డిమాండ్ బాగా పెరిగింది. వేసవిలో మాత్రమే లభించడంతో పాటు ఆరోగ్యానికి మేలు చేయడంతో తాటి ముంజలను కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చెబుతున్నారు. విక్రయదారులు వాటిని పెట్టిన గంటల వ్యవధిలోనే అమ్ముడుపోతున్నాయి. తాటి ముంజలు కొనుగోలు చేయడానికి ప్రజలు గంటలు



తరబడి కూడా వేచి చూస్తున్నారు. ఎండాకాలంలోనే తాటిచెట్లకు అత్యధికంగా ముంజలు కాస్తాయి. ప్రస్తుతం వాటిని నగర ప్రాంతాల్లో పాటు మండల కేంద్రాల్లోని వారసంతాలో విక్రయిస్తున్నారు. ప్రధానంగా పెంచికల్‌పేట్ మండలం నుండి కమ్మర్గాం తదితర గ్రామాల నుండి తాటి ముంజలను తీసుకువచ్చి అమ్ముతున్నారు కాగజ్‌నగర్ పట్టణంలోని ఈజ్‌గాం ప్రాంతం నుండి తాటి ముంజలను తీసుకువచ్చి అమ్ముతుంటున్నారు. 12 తాటి ముంజలకు రూ.80 నుండి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. తాటి ముంజలకు మంచి ఆదరణ లభిస్తుండడంతో ఎక్కువ శాతం విక్రయాలు సాగుతున్నాయని, దీంతో వేసవి కాలంలో ఉపాధి పొందుతున్నామని తాటి ముంజలను అమ్మక దారులు తెలిపారు.

ఎండాకాలం ఎంతో చలువ...

తాటి ముంజలు తింటే ఎండ దెబ్బ తగలకుండా చల్లదనంగా ఉంటుందని వైద్యులు తెలుపుతున్నారు. ఎండాకాలంలో మనిషికి అలసట రాకుండా డిహైడ్రేషన్ కాకుండా ఉంచుతుంది. గర్భిణీలు తాటి ముంజలు తింటే ఆరోగ్యవంతంగా ఉంటారు. ముఖ్యంగా మనిషి బరువును తగ్గించడంతో తాటి ముంజలు ఎంతో దోహదపడతాయి. ఇలా తాటి ముంజలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

శ్రమ ఎక్కువ...

తాటి ముంజలు అమ్మడానికి ఎక్కువ శ్రమ పడాల్సిన పరిస్థితి వస్తుందని తాటి ముంజలు విక్రయించే వారు తెలుపుతున్నారు. తాటి చెట్టు ఎక్కి గెలలు కోయడంతో పాటు వాటిని తీసుకువచ్చి ముంజలుగా కట్ చేసి ప్రజలకు విక్రయించడానికి చాలా శ్రమ పడాల్సి వస్తుందంటున్నారు. ఈ వేసవిలో శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుందని ముంజల రేటు పెరగడమే దీనికి కారణమని పేర్కొంటున్నారు. అయితే రాను రాను చాటిచెట్ల సంఖ్య తగ్గిపోవడంతో రాబోయే కాలంలో తాటి ముంజలు దొరికే పరిస్థితి కనబడడం లేదని వారు వాపోతున్నారు. గతంలో విరిగా విరివిగా లభించే తాటి ముంజలు ఇప్పుడు తక్కువగా లభిస్తున్నాయని, వేసవికాలంలో ప్రతి వారం తాటి ముంజలు తీసుకువచ్చి వారసంతల్లో అమ్మేవారమని ఇప్పుడు ఆ పరిస్థితి లేదంటున్నారు. ఈ వేసవికాలంలో కనీసం రెండు మూడు సంతల్లోనే తాటి ముంజలు విక్రయించామని తర్వాత తాటి ముంజలు దొరకడం లేదని తెలుపుతున్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ జాఫర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ నివారణకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రయివేట్ కార్పొరేట్ ఫీజుల దోపిడీని నివారించాలన్నారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ఫీజుల నియంత్రణకు క్రమబద్ధమైన విధానాన్ని తీసుకురావాలని, అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చూడటం లక్ష్యంగా పాఠశాల ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలలు ప్రతి విద్యాసంవత్సరంలో 10 నుండి 30 శాతం వరకు ఫీజులను పెంచుతున్నాయనీ, ప్రయివేట్ పాఠశాలల్లో పెరుగుతున్న విద్య ఖర్చులను ఎదుర్కొంటున్న తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. కార్పొరేట్ విద్య పేరట నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీకి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, బెల్టు, టై లాంటివి కూడా అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. 2022లో అప్పటి ప్రభుత్వ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం అమలు చేస్తూ ప్రతి సంవత్సరం ఫీజు 10 శాతం పెంచకుండా చూడాలని, దానికోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వసాకే సాయి, జిల్లా కమిటీ సభ్యులు నితీష్, అయ్యూబ్, నాయకులు తిరుపతి, సాయి పాల్గొన్నారు.

వర్షాకాలంలో తిప్పలు తప్పవా..?

- జిల్లా కేంద్రంలో పలుచోట్ల నీరు నిలిచే అవకాశం
- ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి





నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలం సమీపిస్తున్న వేళ జిల్లా కేంద్రాల్లో గత అనుభవాల నేపథ్యంలో పలుచోట్ల వర్షం నీరు నిలువ ఉండడంతో జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా, ఏఆర్‌హెడ్ క్వార్టర్స్ వెనకాల, పైకాజి నగర్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం పడితే నీరు నిల్వ ఉంటుంది. అయితే ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా ఉండకపోవడమే నీటి నిలువకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అయితే వర్షాకాలంలో వచ్చే తిప్పలకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో మళ్లీ తిప్పలు తప్పేలా కనిపించడం లేదు.

ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి

వర్షాకాలంలో జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో నీరు నిలువ కారణంగా బురద ఉంటుంది. దీంతో దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంటుంది. ప్రతి సంవత్సరం ఈ సమస్య ఉన్న నిధుల లేమి, అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపు లేని తనంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని కాలనీ వాసుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ప్రజలు అనేకసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేకుండా పోతోంది. ప్రస్తుతం మున్సిపాలిటీగా మారడంతో సమస్యలు పరిష్కారం అవుతాయని గంపెడు ఆశలతో పట్టణ ప్రజలు వేచి చూస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రయత్నం

భూజంగరావు, మున్సిపల్ కమిషనర్



మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించడం కోసం కృషి చేస్తాం. రానున్న వర్షాకాలంలో నీటి నిలువ లేకుండా చూసేలా చర్యలు చేపడతాం. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి సమస్య రాకుండా ప్రణాళిలు చేస్తున్నాం.

తోకల రాజేశంకు సత్కారం



నవతెలంగాణ-నస్పూర్

శత పద్య కవుల కవి సమ్మేళనంలో భాగంగా ఆదివారం శ్రీశ్రీ కళావేదిక ఏలూరులో జరిగిన కార్యక్రమంలో తెలుగు రచయిత వేదిక మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు తోకల రాజేషను ఘనంగా సత్కరించారు. 177 మంది తెలుగు కవులు రాసిన సీసపద్య సంకలనంలో రాజేశం రాసిన పద్యాలున్నాయి. చెరువు మీద రాజేశం రాసిన 3 సీస పద్యాలు సభికుల మన్ననలు పొందాయి. ఈ నేపథ్యంలో రాజేశంను ఘనంగా సత్కరించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై దుబ్బాక సునీల్ డీలర్లను హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ముత్నూర్, ధనోర(బి) తదితర గ్రామాల్లోని విత్తు, ఎరువుల దుకాణాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా పలు రకాల విత్తనాలను పరిశీలించారు. డీలర్లు బిల్ బుక్, స్టాక్ రిజిస్టర్లను విధిగా ఉంచుకోవాలని సూచించారు. షాపుల్లో నిల్వ, అందుబాటులో ఉన్న విత్తనాలను పట్టిక మీద రాయలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పెర్సాపేన్ పూజలో పాల్గొన్న ఎంపీ సోయం బాపురావు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని సాకేర(బి) గ్రామంలో సోయం వంశస్థుల పెర్సాపేన్ పూజలో ఆదివారం ఎంపీ సోయం బాపురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెర్సాపేన్‌ను దర్శించుకుంటే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని అన్నారు. ప్రతి సంవ్సరం ఆదివాసీ, గిరిజన గ్రామంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుకొని ఆదివాసుల పెర్సాపేన్ పూజలు ఘనంగా జరుపుకుంటారని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
మంచిర్యాల
సోమవారం | మే 27, 2024 | www.navatelangana.com

అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని కత్తెర్ల గ్రామం నుండి నేషనల్ హైవే వరకు రూ.1.60 కోట్ల బీటీ రోడ్డు, బోయపల్లి టూ బుగ్గ రోడ్ రూ.2.60 కోట్ల అభివృద్ధి పనులను ఎస్ఈ ముడిమడుగుల శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగియగానే అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎస్ఈ వెంట డీఈ షఫి, ఏఈ సాయి కృష్ణ, కాంట్రాక్టర్ వేంకటేశ్వర్లు ఉన్నారు.

అధైర్యపడవద్దు అండగా ఉంటాం

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

నవతెలంగాణ-దండేపల్లి



ఉపాధి హామీ కూలి పని కొరకు వెళ్ళిన ఉపాధి కూలీలు ఇటీవలే ట్రాలీ బోల్తాపడ్డ ఘటనలో గాయపడగా వారిని ఆదివారం మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదివారం పరామర్శించారు. వారి కుటుంబాలకు రూ.10 వేలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేసి మాట్లాడారు. ఎవరు కూడా అధైర్య పడవద్దని అండగా మేముంటామని హామీ ఇచ్చారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని ఆదుకునే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోళ్లలో నిలువు దోపిడి

● 40 కేజీలకు 10 శాతం అదనంగా కోత..! ● నిర్వాహకులు అందరూ వాటాదారులే..?
● సీపీఐ(ఎం) పరిశీలనలో వెలుగు చూసిన అక్రమాలు ● నేడు ఛలో కలెక్టరేట్‌కు పిలుపు

నవతెలంగాణ-జైపూర్



సీపీఎం జిల్లా కమిటి పిలుపు మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంధర్శించిన నాయకులకు రైతులు నిలువు దోపిడికి గురవుతున్నారని బైటపడింది. 40 కిలోల వరి ధాన్యం కొనుగోలు చేస్తే అదనంగా 4 కేజీలు కోత విధిస్తున్నట్లు తెల్సి నాయకులు ఖంగు తిన్నారు. ఆదివారం భీమారం మండలంలో వివిధ గ్రామాలను సంధర్శించిన సీపీఐ(ఎం) నాయకులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిలువు దోపిడికి గురవుతున్నారని గుర్తించారు. 40 కిలోలకు 4 కిలోలు అంటే క్వింటాలు ధాన్యం కొనుగోలుపై ఏకంగా 10 కిలోల ధాన్యం కోత విధిస్తున్నట్లు తేటతెల్లమైంది. వరి ధాన్యం అమ్ముకోవడం కోసం కొనుగోలు కేంద్రాలను ఆశ్రయించిన రైతులు అనేక అవస్థలు పడుతున్నట్లు సీపీఐ నాయకులు తెలిపారు. వారం పది రోజుల పాటు కొనుగోలు కేంద్రాల్లో నిరిక్షిస్తే తప్పా ధాన్యం అమ్ముకోలేని పరిస్థితుల్లో రైతులు ఎక్కడికక్కడ దోపిడికి గురవుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో పాటు ట్రాన్స్‌పోర్టర్లు, రైస్‌మిల్లర్లు, అధికారులు అంతా కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని నాయకులు ఆరోపించారు. లారీలు దించుకోవడం లేదు అనే సాకుతో వారం పది రోజులు తూకం వేయకుండా నిర్వాహకులు ఇబ్బందులు పెడుతూ చుట్టుపక్క గ్రామాల నుండి రూ. 1700, 1800 చొప్పున తక్కువ ధరతో ధాన్యం కొనుగోలు చేస్తూ మిల్లుకు పంపిస్తున్నట్లు తెలుస్తోందని తెలిపారు. కేంద్రాల వద్దకు రానటువంటి లారీలు తక్కువ ధరతో పక్క గ్రామాల్లో కొనుగోలు చేసిన ధాన్యం రవాణా చేసేందుకు లారీలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. కేంద్రంలో అమ్ముకున్న వడ్లు తూకం వేయడానికి హామాలీలకు రైతు డబ్బులు చెల్లించాలి. బస్తాలు కుట్టేందుకు సుతిలి కొనివ్వాలి అయినా పర్వాలేదు అంటే వారం పది రోజులు కేంద్రంలో పడిగాపులు పడి ఏదోవిధంగా విక్రయించిన వడ్లు మిల్లులో దించుకునే వరకు రైతు బాధ్యతగా నిలువాల్సిన పరిస్థితుల్లో రైతులు పంటలు సాగు చేయడం సాధ్యమైన పనేనాని ప్రశ్నించారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వ విధానానికి ఏమాత్రం తీసిపోలేదని సీపీఐ(ఎం) నాయకులు విమర్శించారు. ఈ విధంగా రైతు మోసపోతున్నాడనే విషయం అధికారులకు మాత్రమే కాదు ప్రజా ప్రతినిధులకు తెల్సినా తెలియనట్టు వ్యవహరిస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వార రైతులకు జరుగుతున్న అన్యాయం పట్ల ప్రభుత్వం స్పందించకపోయినా సీపీఐ(ఎం) స్పందిస్తుంది. నిలువు దోపిడికి గురవుతున్న రైతులకు అండగా సీపీఐ(ఎం) నిలబడుతుందని తెలిపారు. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టడం కోసం రైతులతో కలిసి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్ కార్యక్రమం ద్వార ప్రభుత్వ అధికారులను కలువనున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను సంధర్శించిన నాయకుల్లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, దూలం శ్రీనివాస్, బోడంకి చందు, జిల్లా కమిటి సభ్యులు లస్మయ్య, దుర్గం బొంద్యాలు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యం

నవతెలంగాణ-వేమనపల్లి

నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపిన వివరాల ప్రకారం.. చామనపల్లి గ్రామ సమీపంలో గల అడవిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించిందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మతుడు సుమారు 60-65 వయసు, 5.7 ఎత్తు, తెల్లని గడ్డం, పొడవైన జుట్టు, ఒక సంచిలో బ్లాంకెట్, లుంగీ వాటర్‌బాటిల్, లైటర్, రాగికడెం, ఎడమ చేతి వేలికి రాగి ఉంగరం ఉంది. సుమారు 20-25 రోజుల క్రితం మరణించి, మృతదేహం కుళ్ళిపోయి దుర్వాసన వస్తుంది. ఈ ఆనవాళ్ళ తెలిసిన బంధువులు ఎవరైనా ఉంటే నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్ పటేల్ తెలిపారు.

కారు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు మృతి

నవతెలంగాణ-జన్నారం



కారు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు మతి చెందినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన కందుల లచ్చన్న(68) శనివారం ఉదయం తీవ్రంగా గాయపడ్డాడు. ఉపాధి హామీ పనికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్న సమయంలో మహమ్మదాబాద్ బస్ స్టాప్ కు సమీపంలో కారు (టీఎస్ 20 డీ 0368) అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ లక్షెట్టిపేట నుండి జన్నారం వైపు వస్తున్న లచ్చన్న ద్విచక్ర వాహనంను ఢీ కొట్టింది. తలకు ఇతర చోట్ల బలమైన దెబ్బలు తగలడంతో వెంటనే మైరుగైన వైద్యం కోసం హైదరబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరళించగా మృతి చెందాడు. వద్ధుడి మృతికి కారణమైన తిర్యాని మండలం గిన్నెదరి గ్రామానికి చెందిన మడావి శ్రీనివాస్‌పై మనుమడు పానగంటి కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజా వర్ధన్ తెలిపారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని చందారం గ్రామానికి చెందిన రాథోడ్ రాజేందర్(31) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. లక్షెట్టిపేట ఎస్ఐ రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మతునికి మొర్రిగూడా గ్రామానికి చెందిన సుజీతతో వివాహం కాగా ఇద్దరు పిల్లల సంతానం ఉన్నారు. ఈ నెల 21న తన భార్య తల్లిగారిళ్ల మొర్రిగూడలో అమ్మవారి పూజ ఉంటే రాజేందర్ అక్కడికి వెళ్లాడు. డీజే పాటలకు డ్యాన్స్ చేస్తున్న సమయంలో బావమరిది దేవేందర్ భార్య రజిత గొడవపడి బూతులు తిట్టి కొట్టడంతో మనస్తాపం చెంది ఈ నెల 25వ తారీకున పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ రాత్రి చనిపోయాడు. ఈ మేరకు మృతుడి తండ్రి రాథోడ్ నాందేవ్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నస్పూర్

33కేవీ మరమ్మత్తులో భాగంగా సోమవారం నస్పూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రమ్మూర్తి ఒక ప్రకనటో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



నవతెలంగాణ-హాజీపూర్

కర్ణమామిడి గ్రామంలోని రైతు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో హాజీపూర్ ఎఫ్‌పీసీ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హాజీపూర్ ఎఫ్‌పీసీ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రైతులందరూ తమ అవసరాల నిమిత్తం 10 నుంచి 20 గుంటల వరకు సేంద్రియ వ్యవసాయం ఇంటి అవసరాల నిమిత్తం ఒక గుంటలో కూరగాయలు ఆకుకూరలు పండించుకోవాలని సూచించారు. డైరెక్టర్ బొడ్డు శంకర్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు తగిన విధంగా సహాయ సహకారం అందించి తన క్షేత్రం నుండి ఆవు మూత్రం, పేడ అందిస్తామని తెలిపారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఎఫ్‌పీసీ ద్వారా కొనుగోలు చేస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు కొట్టే రవీందర్, బన్న శేఖర్, బొడ్డు భూమన్న, ముకుందరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కొనసాగుతుంది

● ఎమ్మెల్యే వివేక్ పట అనుచిత వాఖ్యలు సరికాదు



నవతెలంగాణ-జైపూర్

నియోజకవర్గం పరిధిలో వరి ధాన్యం కొనుగోళు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకుడు, ఆమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ మూల రాజిరెడ్డి, కోఆపరేటీవ్ బ్యాంక్ చైర్మన్ చల్ల రాంరెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పట్ల అసత్య, అనుచిత వాఖ్యలు చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకుల తీరును తీవ్రంగా ఖండించారు. ఆదివారం చెన్నూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న తీరును వివరించారు. సుమారుగా తొమ్మిది వేల టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటికే రైస్ మిల్లులకు తరిలించినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల వ్యవధితో కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఒకటి రెండు మినహా ప్రతి కేంద్రం పరిధిలో దాదాపుగా 80 శాతం కొనుగోళ్లు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ఒకటి రెండు రోజుల్లో మిగిలివున్న ధాన్యం కొనుగోలు చేయడం పూర్తవుతుందని అన్నారు. కోటపల్లి మండలంలో ధాన్యం కొనుగోళ్లు వారం రోజుల వ్యవధితో పూర్తి కానున్నాయని తెలిపారు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో మాట్లాడుతున్న స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ విమ్మర్శించడం సరికాదని అన్నారు. బొగ్గు లారీలను అమ్ముకున్న గోమాస శ్రీనివాస్‌కు వ్యవసాయం గురించి ఏమీ తెలియదని ఎద్దేవా చేశారు. నిజాయితిగా పని చేస్తున్న వివేక్ వెంకటస్వామిని విమ్మర్శిస్తే ఆకాశం మీదికి ఉమ్మివేస్తే ఎలా ఉంటుందో విమ్మర్శించిన నాయకుల పరిస్థితి అదేవుంటుందని అన్నారు. చెన్నూర్ పట్టణానికి చెందిన కమ్మల రాజేశ్ ఆత్మహత్య చేసుకుంటే ఆయన కుటుంబానికి వివేక్ వెంకటస్వామి ఆర్థిక తోడ్పాటు అందివ్వగా అదే సమయంలో బీఆర్ఎస్‌లో ఉన్న నాయకుడు రాజేశ్ కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తామని చెప్పిన ఆయన ఇప్పుడు బీజేపీలో ఉండి విమ్మర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో చెన్నూర్ మున్సిపల్ కౌన్సిలర్లు పోగుల సతీష్, హేమంత్ రెడ్డి, బాపు రెడ్డి, చెన్నూరి శ్రీధర్, సుశీల్ కుమార్, అంగా గౌడ్, చింతల శ్రీనివాస్, చెన్న వెంకటేష్, కొంపల్లి బానేష్, పెండ్యాల శ్రీకాంత్, అన్వర్, చెన్నూరి రాజేష్, కడవండి మహేష్, గడ్డం సుమన్ పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప కామరాతిల కల్యాణం

నవతెలంగాణ-నస్పూర్



సీతారాంపల్లిలోని గొల్లవాడలో గల బీరప్ప ఆలయంలో కుల గురువు భీరయ్య కామరాతిల కల్యాణాన్ని ఆదివారం గొల్ల కురుమ కులస్తులు వారి కులాచారం ప్రకారం భీర్ల పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామునే దాదాపు 110కి పైగా లగ్నం బోనాలను గొల్ల, కురుమ మహిళలందరూ ఒకే రంగు గల చీరలు కట్టుకొని బోనాలు ఎత్తుకొని బయలుదేరగా ఒళ్లంతా పసుపు, గంధం పూసుకుని గజ్జలు కట్టుకున్న బీర్లకళాకారులు డోలు, తాళాలతో శివసత్తుల పునకాల నడుమ బోనాలను గుడి వద్దకు తీసుకువచ్చి బోనాలను గుడిలో ప్రతిష్ఠించారు. అనంతరం భీర్ల పూజారులు పసుపు, కుంకుమ, పెద్దగా పట్నం వేసి గుడిలో గల లింగాలను పట్నంపై ప్రతిష్ఠించారు. సాంప్రదాయం ప్రకారం కుల గురువు అయ్యల భీరయ్య కామరాతిల కళ్యాణాన్ని నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ కళ్యాణాన్ని చూడడానికి గొల్ల కురుమ కుటుంబాలకు వచ్చిన బంధువులే కాకుండా, ఊరిలోని ఇతర కులస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల సైతం ఎంతో ఆసక్తితో తిలకించారు. ముఖ్యంగా బీర్ల కళాకారులు అక్క మహంకాళి, అయ్యల బీరయ్య-కామరాతిల, బోయుడు భోగన్న వేషధారణలతో భీరన్న ఒగ్గు కథ చెబుతూ వచ్చిన భక్తులను ఆకట్టుకున్నారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకు ఒకసారి గొల్ల కురుమ కులస్తులు జరుపుకునే అతిపెద్ద పండుగ అని కొనియాడారు. ఆడపడుచులు బోనాలతో కదులుతుంటే కన్నుల పండుగ ఉందన్నారు. ప్రజలందరిని ఆయురారోగ్యాలతో, ఆశ్చర్యాలతో వెలుగొందెల చూడాలని దేవున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కుందారంలో హనుమాన్ భక్తుల శోభాయాత్ర

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని కుందారం గ్రామంలో హనుమాన్ భక్తులు ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ మాలధారణతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. గురుస్వామి గోల్కొండ రవి గౌడ్ ఆధ్వర్యంలో సుమారుగా వంద మంది హనుమాన్ దీక్షాపరులు శోబాయాత్రలో పాల్గొన్నారు. శోభాయమానంగా సాగిన శోభాయాత్రలో హనుమాన్ దీక్షపరులతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు అరికట్టాలి

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-జైపూర్

వడ్ల కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలను వెంటనే అరికట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. ఆదివారం కోటపల్లి మండలం రొయ్యలపల్లిలో సీపీఐ(ఎం) కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తూకం వేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మరికొన్ని కేంద్రాల్లో తూకం వేసినా రవాణా చేయకుండా లారీలు రావడం లేదు అని బుకాయిస్తూ బస్తా ఒకంటికి 4 నుండి 5 కిలోలు కోతకు అంగీకరించాలని నిర్వాహకులు రైతులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఆరుగాలం శ్రమించిన రైతులు తాము పండించిన పంటలను అమ్ముకోలేని పరిస్థితుల్లో ఇబ్బందులకు గురవుతుండగా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఈ క్రమంలో నేడు ఛలో కలెక్టరేట్ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు బోడంకి చందు, దూలం శ్రీనివాస్, కావిరి రవి, బాగల రాజన్న, టీపీజీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి బక్కన్న, లచ్చన్న, ఉమారాణి, కరంభీ, లక్ష్మి, బొంద్యాలు, కుమార్, సమ్మక్క, భూదక్క, రాజేశ్వరి, మల్లీశ్వరి, రామయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన షేక్ రషీద్‌కు మన వంతు సాయం వాట్సాప్ గ్రూప్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు షేక్ రషీద్ వంద రోజుల పని వద్ద పక్షవాతంతో స్పృహ తప్పి కిందపడడంతో హుటాహుటీనా ఆస్పత్రికి తీసుకొని వెళ్లగా రక్తం గడ్డ కట్టడంతో ఆపరేషన్ చేయగా చాలా వరకు ఆర్థికంగా నష్టపోయాడు. రషీదు చాలా సార్లు రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలు కాపాడడంతో కష్టాల్లో ఉన్న రషీదుకు తమ వంతు సహాయం చేయాలని ఉద్దేశంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతూ పాలు పోలేని స్థితిలో ఉన్న రషీద్ కుటుంబానికి మనవంతు సహాయం గ్రూప్ ద్వారా అడ్మిన్ బోయిని తిరుపతి యాదవ్ పరిస్థితిని సభ్యులకు వివరించగా స్పందించిన గ్రూప్ సభ్యులు తలో చేయి వేసి తమవంతుగా రూ.24000 జమ చేసి డబ్బులను షేక్ రషీద్ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆడే బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి యాదవ్, పొన్నవేణి శ్రీనివాస్, మారం మహేందర్, బోయిని సాయికిరణ్, తయుబ్, షేక్ అలీమ్, వజ్జల రాజు, ఆవుల కుమార్, దాసరి అజయ్, దుర్గం శేఖర్, సల్మాన్ పాల్గొన్నారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న గోమాత శ్రీనివాస్



నవతెలంగాణ-జైపూర్

పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వ్యవసాయం అంటే తెలియని బీజేపీ నాయకులు రైతుల ఇబ్బందులు గుర్తు చేయడం హాస్యాస్పదమని అన్నారు. కాంగ్రెస్ నుండి టికెట్ ఆశించి తిరస్కరణకు గురై బీజేపీలో చేరిన గోమాస శ్రీనివాస్ కాంగ్రెస్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. వరి ధాన్యం కొనుగోలు దాదాపుగా పూర్తికావస్తుండగా విషయం తెలియని గోమాస కొనుగోళ్ల విషయంలో మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ రైతులకు బాసటగా నిలిచే విషయాన్ని మర్చిపోవద్దు అన్నారు.. ప్రజల బాగోగులు కోరే నాయకుడు కాక వెంకటస్వామి కుటుంబం నుండి వచ్చిన వివేక్ వెంకటస్వామి అనునిత్యం పేదల అభ్యున్నతికి పాటుపడే వ్యక్తిఅని గుర్తు చేశారు. అలాంటి కుటుంబం నుండి వచ్చిన వివేక్ వెంకటస్వామి విమర్శించడం నీతిమాలిన చర్య అని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజుద్దీన్, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, శీలం వెంకటేశం, అంబల రవి, కలికి రమేష్, భేద మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

లక్షెట్టిపేట: పట్టణంలోని యూపీఎస్ పాఠశాలలో 1987 నుండి 1993 వరకు చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల కోసం మైక్ సెట్ స్పీకర్లను పూర్వ విద్యార్థులు చదువుతున్న విద్యార్థులకు అందజేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పట్టణంలోని కేఆర్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గురువులకు శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆర్గనైజర్స్ మాటేటి రమేష్, నలినీకాంత్, సురేందర్, మల్లేష్, జావిద్, రాజ్ కిరణ్, గోపి, వినోద్, సుధాకర్ వ్యవహారించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | మే 27, 2024 | www.navatelangana.com

విద్యుద్ఘాతానికి గురై రెండు ఆవులు మృత్యువాత

నవతెలంగాణ-తాంసి



విద్యుద్ఘాతానికి గురై రెండు ఆవులు మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని గిరిగామ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు దారుట్ల విలాస్, జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆవులు రోజు మాదిరిగానే మేత మేసేందుకు వెళ్లాయి. ఆదివారం లింగి గ్రామానికి చెందిన మహేందర్ వ్యవసాయ క్షేత్రంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృత్యువాత పడ్డాయి. ఆవులు రెండు అక్కడికక్కడే మృతి చెందారు. వాటి విలువ సుమారు 80 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.

రిమ్స్‌పై నుంచి దూకి ఒకరి ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రిమ్స్ పైఅంతస్తు నుంచి ఓ రోగి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆదివారం రిమ్స్‌లో చోటుచేసుకుంది. జన్నారంకు చెందిన సాయి కుమార్(27) గత మూడు రోజుల కింద కడుపు నొప్పితో చేరాడు. కాగా శనివారం అర్ధరాత్రి దాటాక రిమ్స్ భవనం పైకెక్కి మూడో అంతస్తు నుంచి దూకాడు. ఈ ప్రమాదంలో ఆయన కాలు విరుగగా తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే ఆయనకు వైద్యులు చికిత్స నిమిత్తం వార్డులోకి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని చికిత్స పొందుతున్నట్టు వైద్యులు తెలిపారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఐఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష జిల్లా కేంద్రంలో ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఆదివారం జరిగిన ఈ పరీక్షకు పట్టణంలోని నలంద కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నిమిషాల నుంచి 5.30 వరకు రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు పరీక్ష సమయం కంటే ముందుగానే చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి, లోనికి అనుమతించారు. కాగా ఉదయం జరిగిన పరీక్షకు 96 మంది విద్యార్థులు ఉండగా, 95 మంది విద్యార్థులు హాజరై ఒకరు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 96మంది విద్యార్థులు ఉండగా ఒకరు గైర్హాజరైనట్లు సెంటర్ ఇన్‌చార్జి పున్నారావ్ తెలిపారు.

ఎల్‌ఈడి ఫ్లాడ్ లైట్ వితరణ

నవతెలంగాణ-దోమకొండ

బీబీపేట్ మండల కేంద్రం లోని పోలీస్ స్టేషన్‌కు మండల కో అప్షన్ మెంబర్ ఆసిఫ్ ఆధ్వర్యంలో ఎస్సై ప్రభాకర్‌కు ఎల్‌ఈడి ఫ్లాడ్ లైట్ ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రభాకర్ మాట్లాడుతూ బీబీపేట గ్రామంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయానికి సహకరించి ఎల్‌ఈడి ఫ్లాడ్ లైట్ అందించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌లు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజు 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున సమావేశానికి ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన తెలిపారు. శాఖల వారీగా అధికారులందరూ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

పలు గ్రామాల్లో బోనాల పండగ

నవతెలంగాణ-కామారెడ్డి

మండలంలోని మద్దికుంట, కన్నాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఆదివారం పోచమ్మ పండగ నిర్వహించారు. కులాలకతీతంగా అందరూ ఒక్కటై పోచమ్మకు ఆడపడుచులు బోనమెత్తి, బోనంతోపాటు నైవేద్యాన్ని గ్రామ దేవతలకు సమర్పించారు. ఈ సందర్భంగా పిల్లాపాపను ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా రథోత్సవం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తుక్కోజివాడి గ్రామంలో ఆదివారం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. శ్రీ కృష్ణ మందిరం ఆధ్వర్యంలో ప్రధాన వీధులగుండా రథ పై శ్రీ కృష్ణ విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేకంగా వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. మండలంలోని పద్మాజివాడి, మోడేగాం గ్రామాల్లో సదాశివనగర్ గ్రామాల్లో పోచమ్మ పండుగ సందర్భంగా బోనాల ఊరేగింపుగా ఆలయల వరకూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పద్మాజివాడి గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు.

కురిసిన చినుకులు

- వేడి నుంచి ఉపశమనం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలో సాయంత్రం వేళ ఒక్కసారిగా ఈదురుగాలతో వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఎండవేడితో అల్లాడుతున్న ప్రజలకు ఒక్కసారిగా వేడి నుంచి ఉపశమనం లభించినట్టయింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా కొట్టడంతో ప్రజలు రోడ్లపై తిరగలేక ఇండ్లకు పరిమితమైపోయారు. రోడ్లన్నీ నిర్మానుషంగా మారాయి. ఉక్కపోతతో జనాలు తిరగలేక వేడిని తట్టుకోలేక పోయారు. గత రెండు నెలలుగా మార్చి ఏప్రిల్ మే నెలలో ఎండలు రోజురోజుకు తీవ్రం కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం చిరుజల్లులు కురవడంతో కింద నుండి ఉపశనం ప్రజలు పొందుతున్నారు కొద్దిగా వాతావరణం చల్లబడిందని ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

దంచికొడుతున్న ఎండలు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలో గత రెండు రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. దీంతో జనం అల్లాడుతున్నారు. ఉదయం 10 గంటలయిందంటే అడుగు బయటపెట్టలేకపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండతో పాటు ఉక్కపోత ఉండటంతో ప్రజలు అత్యవసరముంటేనే బయటకు వస్తున్నారు. దీంతో ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గత రెండు రోజులుగా ఎండ తీవ్రత 45 డిగ్రీలకు చేరడంతో తీవ్ర ఉక్కపోతకు గురవుతున్నారు. ఎండ వేడితో ఎక్కడ ఉన్నా ఇంట్లో గాని చెట్ల కింద గాని వేడి గర్మితో అల్లాడిపోతున్నారు. కూలర్లు పెట్టుకుంటున్నా ఉక్కపోత పీడటం లేదు. ఎండ తీవ్రతతో జనాలు జ్వరం బారిన పడుతున్నారు. ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరలేక ప్రజలంతా అల్లాడిపోతున్నారు. నడి వేసవిలో ఇటీవల అకాల కురిసిన వర్షాలతో కొద్ది రోజులు చల్లదనం నెలకొన్నా.. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో ఎండివేడి పెరిగింది. అయితే జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని, చల్లదనం ఉండేవిధంగా చూసుకోవాలని సూచిస్తున్నారు.

గాండ్ల సంఘం బలోపేతానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గాండ్ల సంఘం బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని, జిల్లా కమిటీకి ఎల్లవేళలా అన్నివిధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర కమిటీ బాధ్యులు భరోసా కల్పించారు. ఎటువంటి సమస్యలు తలెత్తిన వాటి పరిష్కారానికి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిన్నంవార్ రాజేశ్వర్, తమ్మలవార్ చందు అధ్యక్షతన జరిగిన సంఘం జనరల్ బాడీ సమావేశానికి తెలంగాణ గాండ్ల తేలికుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆమనగంటి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లం శ్రీహరి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జక్కం సంపత్, లీగల్ అడ్వైజర్ కమిటీ చైర్మెన్ బొల్లం వీరసుందరం, కమిటీ మెంబర్ బొల్లం శ్రీధర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం బాధ్యులు, కులపెద్దలు అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తమవంతుగా శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. గాండ్ల సంఘం బలోపేతం కావడమే తామందరి అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బిర్యూర్‌వార్ నగేష్, గాండ్ల సంఘం గౌరవాధ్యక్షులు విలాస్, జిల్లా కోశాధికారి నగేష్, యువజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆసప్‌వార్ ప్రమోద్, బిర్యూర్‌వార్ దినేష్ పాల్గొన్నారు.

బీడీ కార్మికుల కొత్త వేతన ఒప్పందం చర్చలు సఫలం

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్‌టౌన్

బీడీ కార్మికులకు కొత్త వేతన ఒప్పందం చర్చలు సఫలమయ్యాయని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐఎఫ్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీలు చుట్టే కార్మికులకు, బీడీ ప్యాకర్లు, బట్టీవాలా, చెన్నివాలా, బీడీ చాటర్స్, ట్రె పిల్లర్, క్లర్క్స్ మొదలగు కేటగిరీలకు చెందిన కార్మికులకు గత వేతన ఒప్పందం ఏప్రిల్ 30న ముగిసిందన్నారు. కొత్త వేతన ఒప్పందం కోసం తమ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ తరపున కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నోటీసు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఫలితంగా ఈనెల 25న బీడీ కార్మిక సంఘాలకు బీడీ యాజమాన్య సంఘంతో హైదరాబాద్ కొంపల్లి లోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో చర్చలు జరిగాయన్నారు. ఈ చర్చల్లో బీడీ ప్యాకర్లకు నెలకు రూ.3650 నెలసరి ఉద్యోగస్తులకు రూ.1700 చొప్పున వేతనాల పెరిగాయని తెలిపారు. పెరిగిన వేతనాలను మే 1వ తేదీ నుంచి అమలు చేయాల్సి ఉందన్నారు. ఒకవేళ అమలు చేయని పక్షంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, అశోక్, మారుతి ఉన్నారు.

ఖానాపూర్ : బీడీ కార్మికుల కొత్త వేతన ఒప్పందం చర్చలు సఫలమైనట్లు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులకు పెరిగిన వేతనలపై ఖానాపూర్ ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీలు చుట్టే కార్మికులకు, బీడీ ప్యాకర్లు, బట్టీవాలా, చెన్నివాలా, బీడీ చాటర్స్, ట్రె పిల్లర్, క్లర్క్స్ మొదలగు కేటగిరీలకు చెందిన కార్మికులకు గత వేతన ఒప్పందం ముగిసిందన్నారు. కొత్త వేతన ఒప్పందం కోసం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ తరపున కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. బీడీ కార్మిక సంఘాలకు బీడీ యాజమాన్య సంఘంతో హైదరాబాద్ కొంపల్లిలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో చర్చలు జరిగాయన్నారు. ఈ చర్చలు సఫలమయ్యాయని అన్నారు. బీడీ కార్మికుల ఐక్యత వల్లనే కూలీరేట్లు పెరిగాయని, బీడీ కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం లింగన్న, నాయకులు మద్దినేని చిన్న రాజన్న పాల్గొన్నారు.



ఖానాపూర్

బడాపహాడ్‌లో నిత్యదోపిడీ

- రూముల అద్దెపై నియంత్రణేది..?
- ఒక్కో రూమ్‌కు 500 నుంచి 3000 వసలూ
- వేసవి నేపథ్యంలో అమాంతం పెంచి వసూలు
- శిథిలావస్థలో ప్రభుత్వ ధర్మశాలలు

నవతెలంగాణ-వర్ని

సర్వమత సమ్మేళనానికి నిదర్శనంగా నిలిచే బడాపహాడ్(పెద్దగుట్ట)కు వెళ్తే.. సందర్శకులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. గతంలో గుట్టపై నిర్వహణను కాంట్రాక్టర్‌కు అప్పగిస్తుండగా.. అందినకాడికి సందర్శకుల నుంచి దోపిడీ చేస్తున్నట్టు పెద్దఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతూనే ఉండేవి. ప్రస్తుతం కాంట్రాక్ట్ గడువు ముగియడంతో వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహణ చూస్తున్నారు. అయితే గుట్ట కింద ఉండేందుకు ఏర్పాటు చేసే రూములకు ప్రయివేటు వ్యక్తులు ఇష్టానుసారంగా ధర నిర్ణయించి అందినకాడికి దండుకుంటున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వచ్చిన మందిని దృష్టిలో పెట్టుకొని ఆది, శుక్రవారాల్లో ధరలు పెంచి వసూలు చేస్తున్నారు. ఇతర ప్రత్యేక రోజుల్లో అయితే మరింత ఎక్కువ వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో రూమ్‌కు ఏకంగా రూ.1000 నుంచి మూడు వేల రూపాయలు వసూలు చేస్తున్నట్టు సమాచారం.

నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని జలాల్‌పూర్ గ్రామ పరిధిలోగల (పెద్దగుట్ట) బడా పహాడ్ షాదుల్లా హుస్సేన్ బాబా దర్గా పవిత్ర పుణ్యక్షేత్రానికి వేసవి కాలంలో పెద్దఎత్తున తరలివస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఎక్కువ సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించడానికి వస్తు ఉంటారు. వేసవి కాలం కావటంలో మరింత ఎక్కువగా కందుర్లు చేసేవారు కుటుంబ సమేతంగా బంధువులతో పాటు విచ్చేసి వచ్చి రాత్రి నిద్ర చేయడానికి అద్దెకి రూములు తీస ుకుంటున్నారు.

ప్రభుత్వ రూములో నిల్, ప్రవేట్ రూములే ఫుల్

ప్రస్తుతం కాంట్రాక్టర్లు పరిధిలో లేకున్న వక్ బోర్డు అధికారుల పరిధిలో ఉన్న ప్రభుత్వ సంబంధింత రూములు లేకపోవటంతో దర్గాకు వచ్చి మొక్కులు చెల్లించే భక్తులకు ప్రవేట్ రూములు అద్దెకు అధిక ధరకు తీసుకోక తప్పటం లేదు. ఒక రాత్రి కి కుటుంబ సభ్యుల సంఖ్య, బంధువుల సంఖ్య చూచి రూములు ఒకటి నుంచి 5 రూములు తీసుకోని రాత్రి బస చేస్తుంటారు. ఇదే ఆసరాగా చేసుకొని ప్రవేట్ రూముల యాజమాన్యం భక్తుల నుంచి అదిక అద్దె తీసుకొంటున్నారని, ఆ అద్దె లో బాబా దర్శనం పూర్తిగా చేసుకోవచ్చని భక్తులు తెలుపుతున్నారు.

అసలే ఎండలు జోరుగా ఉన్నాయి. చెట్ల నీడ లేక, ధర్మశాలలు లేక తప్పని పరిస్థితి ప్రవేట్ రూములను అద్దెకు తీసుకోక తప్పడం లేదు. ఇదే ఆసరాగా చేసుకొని బడాపహాడ్‌లో నివసించే భక్తులు ఒకొక్క వ్యక్తికీ పది నుంచి 20 రూములు ఉంటాయి. అందులో విద్యుత్, ఫ్యాన్ల పేరుతో ఒక రాత్రి కి 500 రూపాయల నుంచి 2000 రూపాయలు వరకు అద్దెకు ఇచ్చి ప్రవేట్ రూముల వ్యక్తులు జేబులు నింపుకొంటున్నారు. దీనితో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు బాబా దర్శనం కలగా మారుతుందని భక్తులు తెలుపుతున్నారు. అధికారులు ప్రవేట్ వ్యక్తుల అద్దె రూముల కిరాయి తక్కువ ఇచ్చేలా అధికారులు, వక్ఫ్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ప్రభుత్వం తరపున రూములు లేవు

- రాజు (జగిత్యాల)

మేము జగిత్యాల జిల్లా నుంచి బాబాకు మొక్కులు చెల్లించడానికి వచ్చాము. ఇక్కడ ప్రభుత్వం నుంచి నివసించడానికి రాత్రిపూట వసతులు లేకపోవడంతో అద్దెకిరాయిల వద్దకు వెళ్తే ఒక రాత్రికి మందిని చూసి 3 వేల రూపాయల కిరాయి తీసుకుంటున్నారు. దీంతో దూరపుంతల నుంచి వచ్చి నా మాకు డబ్బుల కొరతతో షాదుల్లా బాబా దర్శనం మొక్కులు చెల్లించలేని పరిస్థితి నెలకొంటుంది. ప్రభుత్వమే రూములు కట్టి అద్దెకు అందజేస్తే ప్రయివేటు వ్యక్తులు సైతం ధర తక్కువ చేసే అవకాశం ఉంటుంది.

బీడీ కార్మికులు సంబరాలు నిర్వహించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులకు, ప్యాకర్లకు, బట్టి, చటన్ తదితర కార్మికులకు వేతనాలు (కూలీలు) పెరిగిన సందర్భంగా రెండు రోజులు బీడీ సెంటర్ల వద్ద సంబరాలు జరపాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, (టిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సిరిగాద సిద్దిరాములు బీడీ కార్మికులకు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సోమవారం, మంగళవారం రెండు రోజులు బీడీ సెంటర్ల ముందు ఆనందోత్సాహాలతో సంబరాలు నిర్వహించాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లో బీడీ యాజమాన్యంతో బీడీ కార్మిక సంఘాల నిర్వహించిన వేతన సవరణ చర్చలు సఫలమయినట్టు పేర్కొన్నారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు రూ. 4-25, బీడీ ప్యాకర్లకు రూ 3650, బట్టి, చాటన్ కార్మికులకు రూ.1700 పెంచినట్టు తెలిపారు. ఇది కార్మికుల విజయమని, కార్మిక సంఘాల విజయమని పేర్కొన్నారు. కావున సోమవారం, రోజు ఉదయం ఆయా కంపెనీ సెంటర్ ల ముందు టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకోని కార్మికుల ఐక్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు.

3 సెల్‌ఫోన్‌లు రికవరి.. అందజేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ముగ్గురు బాధితులు పోగొట్టుకున్న 3 సెల్‌ఫోన్‌లను సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం వాటిని బాధితులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మహేష్ అందజేశారు. తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవునిపల్లి గ్రామానికి చెందిన నీల కిష్టయ్య ఫోన్ గత ఏడాది నవంబర్ 13 వ తారీకు నాడు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో పోగొట్టుకున్నారని తెలిపారు. హసన్ పల్లి గ్రామానికి చెందిన కుశలకంటి దుర్గయ్య మార్చి 11న, ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన గణపతి కుమార శర్మ ఫోన్‌ను ఏప్రిల్ 15 తేదీనా పోగొట్టుకున్నట్టు తెలిపారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఈసీ ఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌లను గుర్తించి వారికి అందించామని తెలిపారు.

పలు గ్రామాల్లో బోనాల పండుగ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం గ్రామ దేవతలకు కులదేవతలకు గ్రామస్తులు కులాస్తులు బోనాల పండుగను నిర్వహించారు. లింగంపేట్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో లింగంపల్లి గ్రామ ముదిరాజ్ కులస్తులు వారి ఆరాధ దైవమన పెద్దమ్మ తల్లికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఓడి బియ్యం నైవేద్యం సమర్పించి టెంకాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు. మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఆదివారం దూర ప్రాంతాల నుంచి వందలాది మది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వచ్చి మొక్కలు తీర్చుకున్నారు. గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయం వద్ద ఆయా కులాలకు చెందిన పలువురు మహిళలు అమ్మవారి వద్దకు వచ్చి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు 31 చివరి తేదీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందడానికి ఈనెల 31 ఆఖరు తేదీ అని ప్రిన్సిపాల్ సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమైనాయని, ఎంపీసీ,బైపిసి,సిఇసి, ఎంఇసి ప్రతి గ్రూప్ లో 40 సీట్లు భర్తీ చేసినట్టు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అయిన విద్యార్థులు మెమో,ఆధార్ కార్డు, ఫోటోతో మీసేవ కేంద్రానికి వెళ్లి %షషష్.ంఏశీసవశ్రీంఎష్త్రశీశ్రీం.ఝీఎ% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈదురు గాలులకు కూలీన చెట్టు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలో ఆదివారం మూడు గంటలకు ఈదురుగాలలో వర్షం కురవడంతో వేప చెట్టు కూలిపోయింది. కటికేచాంద్ ఇంటిపై వేప చెట్టు కూలడంతో పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో వేప చెట్టు కూలడంతో పెనుప్రమాదం తప్పింది. ఇంటి యజమానులు తాళం వేసుకొని బంధువుల ఇంటికి వెళ్లారు. వేప చెట్టు కూలి ఇల్లు పాక్షికంగా దెబ్బతినడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కూలిన చెట్టును తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. ఈదురు గాలులకు గ్రామంలోని కురుమ సాయవ్వ హొటల్ రేకులు ఎగిరి కిందపడ్డాయి.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు కామారెడ్డి రైల్వే ఇన్స్‌పెక్టర్ తావునాయక్ తెలిపారు. కామారెడ్డి పరిది లో కే ఎం ఎం ఓ . 4/4-5. మనోహరాబాద్ రైల్వే స్టేషన్ నుండి గజ్వేల్ రైల్వే స్టేషన్ మధ్యలో రామాయపల్లి గ్రామం దగ్గరలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి శవము అందాజ వయసు 55 సంవత్సరముల నుండి 60 సంవత్సరముల ఉంటుందని తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తు పడితే కామారెడ్డి రైల్వే పోలీస్ లను సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన నీలరాగవులు కుటుంబానికి ఆదివారం బీమా కంపెనీ చెక్కును మాజీ సర్పంచ్ అనిల్‌రెడ్డితో కలిసి అందజేశారు. నీలా రాఘవులు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మృతి చెందాడు. ఆయన ఓ కంపెనీ నందు పాలసీ తీసుకోగా.. రూ.5,54,750 చెక్కును నామిని అయినటువంటి మృతుడి భార్య నీలా లక్ష్మికి అందజేశారు.

సారంగాపూర్ ఆలయం వరకు మహాపాదయాత్ర

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని పోతురెడ్డిపల్లి వీరాంజనేయ స్వామి నుండి దేవాలయము నుండి హనుమాన్ భక్తులు ఉమ్మడి జిల్లా సారంగాపూర్ హనుమాన్ మందిరమునకు ఆదివారము మహా పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ నూతన ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈయేడు అధిక వర్షాలు కురిసి సమృద్ధిగా పాడి పంటలతో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లెల చూడాలని పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు తేజ స్వామి, భక్తాదులు పాల్గొన్నారు.

పంటలకు బీమాతో అన్నదాతకు ధీమా

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ 1న మొదలయ్యే వానాకాలం సీజన్ నుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించినట్టు మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ తెలిపారు. ఆదివారమిక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వానాకాలం సీజన్ నుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేయడంతో రైతులకు ఉపశమనం కలగనుందన్నారు. రాష్ట్రంలో ఏటా రెండు సీజన్లలో ప్రకృతి ప్రకోపాలు, అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, గత నాలుగేళ్ల నుంచి బిఆర్ఎస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోవడంతో పంట నష్టపోయిన రైతులకు బిఆర్ఎస్ ప్రభుత్వం నుంచి రూపాయి పంట నష్టపరిహారం దక్కలేదన్నారు. బీమా కంటే రైతులకు కట్టే ప్రీమియం ఎక్కువగా ఉందని చెప్పి ఈ పథకం అమలును రాష్ట్రంలో నిలిపివేసిందని అప్పటి నుంచి అన్నదాత పండించిన పంటలకు ఎలాంటి బీమా పథకాలు లేకపోవడంతో పంట చేతికొచ్చే సమయంలో ఆర్థికంగా నష్టపోయారన్నారు. దీనిని నివారించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న ఖరీఫ్ సీజన్ నుంచే పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రూ.3,000 కోట్లు సంవత్సరానికి పంటల మీద బీమా పథకం కోసం కేటాయించి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని నిర్ణయించడంతో రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందడానికి ఇదే నిదర్శనమన్నారు. పంటలకు బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నందుకు రైతాంగం పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ కి ధన్యవాదాలు తెలుపుతున్నమన్నారు.